# వానలో హోస్ పైపు(?)

రామచంద్ర ప్రభో! ఈ పిల్లలు ప్రాణాలు తోడేస్తున్నారంటే నమ్మండి! ఎక్కడ పెట్టినవి అక్కడ వుండనియ్యరు. లోపల పడవెయ్యమన్నవి అట్లాగే రోజుల తరబడి వదిలేస్తారు. ఏం అడిగినా ఏమీ ఎరగనట్లే మతిమరుపు మాటలు మాట్లాడతారు!

నిన్నటి మట్టుకు నిన్న రాత్రంతా వానకు తడుస్తూ, దొడ్లో అట్లాగే పడి వుంది 'రబ్బరు హోజు'! కిందటిసారి రబ్బరు గొట్టం యిట్లాగే వానకి తడిసి తడిసి చీకిపోయి చిల్లులు పడిందంటే, యీమధ్యనే బోలెడు డబ్బు పోసి పదిహేను మీటర్ల గొట్టం తెప్పించేను. ఈ పిల్లల వ్యవహారం చూస్తుంటే వళ్ళు మండి పోతూంది అనుకోండి.

"ఏరా సుబ్బులూ! రబ్బరు హోజును మొన్నటి నుంచి బయట ఎవర్రా అట్లా వదిలేసింది?" పెద్ద వాడిని పిలిచి అడిగేను.

"ఏమో నాకేం తెల్సు, నేను వదిలెయ్యలేదు." అన్నాడు తకీలుమని.

"పోనీగాని, నువ్వు ఆఖరుసారి ఆ హోజుని ఎప్పుడు వుపయోగించేవేమిటి?" అన్నాను తెలివిగా.

"కిందటి వేసవి కాలంలో దానిని వాడినట్లు గుర్తు. ఆ తర్వాత ఆ హోజు ఎట్లా వుంటుందో కూడా చూడలేదు నేను." అన్నాడు చాలా ఖచ్చితంగా మా సుబ్బులు.


"సరే! నాన్నగారి కారును దేనితో కడుగుతున్నావు మరి?" అని అడిగేను. మూడు రోజులకోసారి మా కారును కడగడం వాడి డ్యూటీ.

"ఏమిటీ? అదా! 'హోజా'? రబ్బర్ హోజు కదూ! మొక్కలకు నీళ్ళు పోసేది? దానిని లోపల పెట్టేసేనే!"

"లోపల పెట్టేస్తే - రాత్రల్లా వానలో నానుతూ ఎట్లా బయటపడి వుందిరా?"

"చెబుతానుండు. ఊరికే ఖంగారు పెట్టి చంపకు. లోపల పెట్టేసినట్లే గుర్తు. ఆ! లోపల పెడదామని దానిని గుండ్రంగా చుట్ట చుడుతున్నాను... అప్పుడు, చిట్టేని పట్టుకోమని యిడ్లీ పాత్ర కూడా యిచ్చేను." అన్నాడు సుబ్బులు.





శివం


"ఇడ్లీ పాత్ర చిట్టి చేతికి నువ్వు యిచ్చేవా?"

"అవును. కారు కడుగుదామని తెచ్చిన యిడ్లీ పాత్ర!"

"నాకు తెలియక అడుగుతాను - కారు కడగడానికి ఇడ్లీ పాత్ర ఎందుకు తేవలసి వచ్చిందట?" కోపాన్ని అణచుకుంటూ అడిగేను.

"ఎందుకేమిటి? సబ్బునీళ్ళు నింపడానికి ఇడ్లీపాత్ర తెచ్చేను."

"అంటే మనం వారం వారం యిడ్లీలు చేసుకునే ఇడ్లీ పాత్రేనా?" అన్నాను లాయర్‌లా గుచ్చి గుచ్చి పలుకుతూ.




"అవును. ఆ పాత్రే! ఈ మధ్య నువ్వు అసలు యిడ్లీలు వెయ్యడం మానేసేవుగా! అవసరం వుండదేమో అని అది తెచ్చేను. పనయి పోగానే ఇడ్లీ పాత్ర, కత్తెర చిట్టి చేతికిచ్చి లోపల పెట్టమని చెప్పి, నేను రబ్బర్ హోజును -"

"కత్తెరా? నేను బట్టలు కత్తిరించే నా కత్తెరే?"

"అవును, నీ కత్తెరే! చిరుగు చివరన వున్న దారాలను దానితోనే కత్తిరించింది చిట్టి." అన్నాడు వాడు కొంచెం విసుగుతో.

"చిరుగేమిట్రా? ఎక్కడుంది చిరుగు?" అన్నాను ఆశ్చర్యంతో.

"కారు వెనుక సీట్‌కి చిన్న చిరుగుందిలే"

"కారు సీట్‌కి చిరుగా? ఎట్లా చిరిగింది? ఎవరు చింపేరు?" అన్నాను గాభరాగా.

"ఎవరేమిటి? మన కుక్క - టామీ! చిరుగు ప్రక్కన దారాలు పైకి లేచి పోతే, వాటిని కత్తిరించి, చిరుగుపైన గుడ్డ కప్పేసేం. ఆ తర్వాత నేను రబ్బర్ హోజ్‌ను చుట్ట బెట్టుతూంటే - చిట్టేమో..."

సుబ్బులు గాడిని వదిలేసి, చిట్టిని పిల్చేను.

"చిట్టీ! ఇడ్లీ పాత్రను శుభ్రంగా కడిగేవే?" అడిగేను.

"ఏమిటమ్మా?"

"అన్నయ్య కారును సబ్బునీళ్ళతో కడిగేక నీకు యిచ్చిన ఇడ్లీ పాత్రను లోపల పెట్టే ముందు శుభ్రంగా నీళ్ళతో కడిగేవా?" చిట్టిని ఓపికగా ప్రశ్నించేను.

"ఆ! నీళ్ళతో ఓసారి తొలిచి, వంటింట్లో పెట్టేసేను. ఏం?"

"సరే! నా కత్తెర ఎక్కడుంది?"

"ఏమో నాకు తెలవదు! ఏమైనా కత్తిరించాలా యిప్పుడు?"

"అదికాదే! మొన్నటినుంచి రబ్బర్ హోజును వానలో ఎవరు వదిలేసేరో తేల్చుకుందామని చూస్తున్నాను."

"అన్నయ్య కారును శుభ్రం చేసేక నేనా? ఏమో నాకు తెలవదు." అన్నది నంగనాచిలాగ.

"పోనీ! నా కత్తెర ఎక్కడ పెట్టేవు?" అన్నాను చిట్టి కళ్ళల్లోకి తీక్షణంగా చూస్తూ.

"నీ కత్తెరేనా? దానిని లోపలకు తీసుకొస్తూండగా కేన్వాస్ చేతిసంచి తయారు చేస్తున్న లలిత అక్కయ్య

వెలువడినవి
1986 సెప్టెంబర్ 10న
మీరు మెచ్చే... మీకు నచ్చే...
శ్రీ కవితా వారి కొత్త నవలలు!
చైతన్య జ్యోతి 1వ భాగం } వాణిరా రూ.22/-
చైతన్య జ్యోతి 2వ భాగం } రూ.22/-
(స్వాతి సపరివార పత్రిక సీరియల్)
సాగరి (డైరెక్ట్ నవల) ..................రూ.20/-
సోత్రా పద్మినీ దేవి (నీడలతో క్రీడలు రచయిత్రి)
దూరతీరాన ఓ తారా'విధం ..........రూ.20/-
జె. వరలక్ష్మి
తొలగిన తెరలు (జనసుధ సీరియల్).....రూ.20/-
సీతా లక్ష్మరాజ్
మీకోసం నగదు లక్ష్మీకృష్ణ ఏర్పాటు చేసాం!
పై 5 నవలలు ఒకేసారి తెప్పించుకొనువారు మాత్రమే పోటీలో పాల్గొనుటకు అర్హులు.
ఆఖరు తేది: 1 జనవరి '87
డ్రా తేది: 14 జనవరి '87 (సంక్రాంతి)
మొదటి బహుమతి: రూ. 300/-
రెండవ బహుమతి: రూ. 200/-
మూడవ బహుమతి: రూ. 100/-
నేడే అడ్వాన్సుతో మీ ఆర్డరు పంపండి.
ఖర్చులు మేమే భరించి మీ ఇంటికే V.P.P. ద్వారా పంపగలం!
శ్రీకవితా పబ్లికేషన్స్
మ్యూజియంరోడ్, విజయవాడ-2.
Bachi

నూతన యవ్వనం పొందండి
సంతానవంతులుకండి!
చర్మ వ్యాధులనుండి విముక్తులుకండి!

దురభ్యాసముల వలన కలిగిన నరముల బలహీనత, దాంపత్య సుఖము లేక పోవుట, ఉబ్బసము, మేహ మచ్చలు, మొదలగు సమస్త దీర్ఘ వ్యాధులకు అద్భుత ఆయుర్వేద చికిత్స! పోస్టుద్వారా చికిత్స కలదు.
క్యాంపులు:* ప్రతి ఆదివారం భీమవరం-షణ్ముఖ లాడ్జిలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6-30 గంటల వరకు.
* ప్రతి నెల 1 మరియు 16 తేదీలలో రాజమండ్రి-హోటల్ అశోకాలో కోటగుమ్మం దగ్గర మధ్యాహ్నం 12 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు.
డా డి. మార్కండేయులు
ఆయుర్వేదభిషక్, సెక్స్ & స్కిన్ స్పెషలిస్ట్
పార్కురోడ్, గుడివాడ - 521 301
ఫోన్స్ : ఆఫీసు : 522 నివాసం : 540

'పక్క క్షణం యిట్లా యియ్యవే' అని లాక్కుంది. పని అయిపోగానే నీ కుట్టు మిషన్ మీద పెట్టెయ్యమని చెప్పేను కూడానే. ఏం? ఇప్పుడది కనబడటం లేదా?" అని అడిగింది చిట్టి గుడ్లు తిప్పుకుంటూ.

"అవును. కనబడటం లేదు." అన్నాను కొంచెం కోపంగా.

"సుబ్బులును అడగవే అమ్మా! వాడే కదా కారును కడిగింది." అన్నది చిట్టి.

"అది సరే! హోజు పైపును వానలో వదిలేసింది వాడేనా?" అడిగేను లాయర్‌లా క్వర్మ్ చేసు కుందామని.

అర్చన అక్క వదిలేసింది."

"అర్చనా?"

"అవును. గులాబీ మొక్కలకి నీళ్ళు పట్టాలని అదే తీసుకుంది."

"అయితే హోస్ పైపును వానలో పడేసింది అర్చన అన్నమాట!" అన్నాను కోపంతో వుడికి పోతూ.

"ఏమో! నన్నింకేమీ అడక్కు బాబూ! నేను మాత్రం దానిని ముట్టుకోలేదు." అంటూ లోపలకు వెళ్ళి పోయింది హడావిడిగా చిట్టి. నా తల తిరిగి పోతూన్నట్లనిపించింది. కొంచెం తమాయించుకుని, యీ సమస్యను ఎట్లాగైనా విడదీయాలనే నిశ్చయంతో లలితను పిల్చేను. "లలితా! నా కత్తెర ఎక్కడుందే?" ప్రశ్నించేను.

"ఏమిటి?"

"అదేనే! నేను బట్టలు కత్తిరించే కత్తెర. సుబ్బులు కారును కడుగుతూ, కత్తెరను, ఇడ్లీ స్పాతను చిట్టికివ్వగా, అది వాటిని లోపల పెడుతూంటే, నువ్వు కేన్వాస్ సంచి తయారుచేస్తూ నా కత్తెరను దాని దగ్గర్నుంచీ తీసుకుని, మళ్ళీ యివ్వలేదు. ఏమైంది అది?" అంటూ ఓపికగా చెప్పేను.

"కత్తెరా? దాని సంగతి నాకేమీ తెలియదు. బహుశా సుబ్బులు దగ్గరే వుందేమొ!"

"సుబ్బులు చిట్టికిచ్చేడంటూ వుంటే, సుబ్బులు దగ్గరే వుందంటావేమిటే?" అన్నాను పగిలిపోతూన్న తలను నొక్కుకుంటూ.

"అయితే చిట్టికి తెల్సివుంటుంది. దానిని అడిగితే సరి. మధ్య నన్ను నిలదీస్తావేమిటి?" అన్నది లలిత.

"ఏమిటే! తమాషాగా వుందా? నువ్వు కేన్వాస్ సంచి కత్తిరించడానికో దేనికో ఆ కత్తెరను చిట్టి దగ్గ ర్నుంచి తీసుకున్నావని చిట్టి చెబుతూ వుంటే, చిట్టిని అడగమంటావేమిటి? మీ అందరికీ మతులు వున్నాయా, పోయేయా?" అన్నాను కొంచెం వుడుకు మోతు తనంతో.

"నాన్నని అడిగేవా? మరి అర్చనని అడిగేవా? వాళ్ళందర్నీ వదిలేసి నన్ను అడుగుతావేమిటి మధ్య." అంది రుద్రమైన కంఠంతో.

"నేను అడిగే ప్రశ్నను బాగా అర్థం చేసుకుని తిన్నగా జవాబు చెప్పు. ఇవ్వాళ ఎవరికో గూబ పగిలి పోతుంది! గుడ్డలు కత్తిరించే నా కత్తెరను, నువ్వు కేన్వాస్ బ్యాగ్ కత్తిరించడానికి వుపయోగించేవా లేదా?

## విచిత్రం

చిత్రమైనవి! విచిత్రమైనవి
నీకంటే నీచేష్టలు చిత్రమైనవి!
కాళ్ళు నావి దారి నాది
నా దారి నాదంటే-
కడగండ్ల దారిచూపి
నీదరికే మరలుస్తావ్!
చేయి నాది చేత నాది
నా చేత నాదంటే-
చింతలపాల్జేస్తావూ
చేతులెత్తి మొక్కిస్తావ్!
మాటనాది మహిమ నా..
నామాటే నాదంటే
పలుపాట్లకు లోనుజేసి
నీపాటే పాడిస్తావ్!
గుండెలోన చోటివ్వక
గుడికి నెట్టినామంటే
గుండె తలుపులెల్లప్పుడు
తట్టి తట్టి పిలుస్తావ్!

-పులికంటి కృష్ణారెడ్డి

ఉపయోగిస్తే ఆ తర్వాత కత్తెరను ఏం చేసేవు? బాగా ఆలోచించి చెప్పు." అన్నాను లలిత చెయ్యి పట్టుకుని.

"ఏమిటే అమ్మా! బట్టలు కత్తిరించే నీ కొత్త కత్తెరేనా? ఇందాకట్నుంచి మరి ఆ సంగతి చెప్పవే"

"ఆ! కొత్త కత్తెరే? ఏం చేసేవు? ఇప్పుడు చెప్పు!"

"అదా! అది కేన్వాస్ బ్యాగ్‌లో వుండి పోయింది."

"నా కత్తెర నీ బ్యాగ్‌లోనే వుందా?"

"అవును. నా బ్యాగ్‌లోనే వుంది."

"ఎక్కడ? ఆ కేన్వాస్ బ్యాగ్ ఎక్కడ? ఇట్లా పట్రా — అందులో కత్తెర వుందో లేదో చూద్దాం."

"ఆ బ్యాగ్... మరే... మరే... స్కూల్లో ఎగ్జి బిషన్‌లో పెట్టడానికని టీచరమ్మ తీసుకుంది. అది స్కూల్లోనే వుండిపోయింది."

"రామచంద్రా! ఆ కొత్త కత్తెరను బ్యాగ్‌లో పెట్టేసి ఎగ్జిబిషన్‌లో పెట్టడానికని టీచర్‌కి యిచ్చేసేవన్నమాట. అంతేనా? నిన్నెవరు యివ్వమన్నారు అసలు?"

"నాన్నగారిని అడిగితే యిచ్చేయ్యమన్నారమ్మా."

"సరే, నువ్వు పో. మీ నాన్నగారినే అడుగుతా." అంటూ దానిని అవతలకి పంపించి శ్రీవారి దగ్గరకు వెళ్ళాను చిటపట లాడిపోతూ. ఏమైనా సరే యీ శ్రవ హోరం సంగతి యివ్వాళ తేల్చుకోవాలనుకున్నాను మరో సారి

"ఏమండీ! లలితను మీరు నా కత్తెర తీసుకుని వెళ్ళమన్నారా స్కూలుకి?"

"ఏమిటే - మళ్ళీ చెప్పు." అన్నారు ఆశ్చర్యంగా ఆయన.

"పోనీండి ఆ సంగతి. హోజు పైపును వానలో మొన్నటినుంచి అట్లా ఎవరు వదిలేసేరు?"

"అదేమిటి, నన్నడుగుతావు! నేనెందుకు వది లేస్తాను! పిల్లలను అడగక పోయేవా? అయినా యీ యింట్లో ఎవరిని ఏది అడగాలో, అడగకూడదో వక్క ళ్ళకీ తెలియదు. అందరికీ మతులుపోతున్నాయి." - న్యూస్ పేపరును ప్రక్కన పెట్టి, "కత్తెర అన్నా వేమిటి? చదువుకునే వాళ్ళకు కత్తులు, కత్తెరులు దేని కంటాను? అయినా యీవిద్యా విధానం వుంది చూడు, వకో మినిస్టర్ మారగానే, వకో రకంగా మారిపోతోంది - ఇంక మన పిల్లలు... " ఆయన వుపన్యాసం తప్పించు కోవడానికి అక్కడనుంచి పారిపోక తప్పింది కాదు.

"అర్చనా! మన గార్డెన్ హోజు పైపును మొన్న రాత్రి బయటే ఎవరు వదిలేసేరే?"

"ఏమో ఎవరు వదిలేరో నాకు తెలియదుగాని, నేను మాత్రం గులాబీ మొక్కలకి నీళ్ళు పట్టి, లోపల పెట్టేసేను."

"ఎప్పుడు?"

"ఎప్పుడా? మొన్న సాయంత్రం."

"నిజంగా లోపల పెట్టేవా లేకపోతే నీ స్నేహి తురాలు పిల్చిందని, అక్కడే వదిలేసి వెళ్ళి పోయేవా?"

"లోపల పెట్టేసినట్టే బాగా గుర్తు. బయట వదిలె య్యడానికి నేనేం చిన్న పిల్లనా? అది సరేగాని నాకు నీలం రంగు ఓణీ వకటి కొనిపెట్టవే... యీవోణీ నా జాకెట్ కి మేచ్ కావడం లేదు."

"సరే చూద్దాంలే" అంటూ హాల్లోకి వచ్చి తిరిగి పోతూన్న తలకాయను పట్టుకుని కుర్చీలో కూలబడ్డాను.

ఉన్నట్లుండి ఆకస్మికంగా గుర్తుకొచ్చింది... మొన్న సాయంత్రం పిల్లలు హోజు పైపును లోపలే పెట్టేసి వుంటారు. ఎందుకంటే నిన్న సాయంత్రం నేనే మొక్కలకు నీళ్ళు పడుతూ వర్షం చినుకులు పడు తున్నాయని హోజుపైపును దొడ్లోనే వదిలి లోపలకు పరుగెత్తేను. అయినా అట్లా అర్ధాంతరంగా మొదలైన వాన రాత్రంతా కురుస్తుందని ఎవరను కుంటారు? ఆలోచిస్తుంటే, చిన్నచిన్న విషయాలకు పూరికే బుర్రను పాడు చేసుకోవడమంత బుద్ధి తక్కువ పని మరొకటి లేదనిపిస్తుంది. ఇదిగో యిట్లాంటి విషయాలు మగవాళ్ళకు తెలిస్తే వాళ్ళు, ఆడవాళ్ళను మతిమరుపు మనుషులని శాశ్వతంగా ముద్రవేసేస్తారు. అందుకని ఎక్కడి దొంగలక్కడే అన్నట్లు 'గప్ చిప్'గా వుండటం మంచిది.

